క్లుప్తంగా

నేడు బ్రాడీపేటలో జగనన్న సురక్ష

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలోని బ్రాడీపేట-1 సచివాలయంలో ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. జగనన్న సురక్షలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందిస్తామని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

భక్తులతో కిటకిటలాడిన తలుపులమ్మ లోవ



భక్తుల పూజలందుకుంటున్న తలుపులమ్మ అమ్మవారు

రాయవరం: మండలంలోని పసలపూడి-మాచవరం గ్రామాల మధ్య పొలాల్లో కొలువైన చిన తలుపులమ్మ లోవ ఆదివారం భక్తులలో కిటకిటలాడింది. ఆషాఢ మాసం మూడో ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాధారణంగా ప్రతి మంగళ, ఆది, శుక్రవారాల్లో తలుపులమ్మలోవకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. ప్రస్తుతం ఆషాఢ మాసం కావడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. అమ్మవారిపై ఉన్న నమ్మకంతో రాయవరం, రామచంద్రపురం, మండపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు ఇక్కడ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. మొక్కులు తీర్చుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వంట కాలు చేసుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వంటకాలు చేసుకుని సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో కొలువైన శ్రీధనమ్మ తల్లి ఆలయానికి భక్తుల తాకిడి అధికమైంది. సెలవు దినం ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దూర ప్రాంతాల పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో ధనమ్మ మర్రిని సందర్శించారు. అమ్మవారికి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి నదీ తీరంలో నడయాడుతూ ఆహ్లాదకరమైన అందాలను ఆస్వాదించారు. అంగర ఎస్‌ఐ జి.చంటి ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా శ్రీమావుళ్లమ్మ వారి చిన్న జాతర



చెల్లూరులో భక్తుల పూజలందుకుంటున్న శ్రీ మావుళ్లమ్మ అమ్మవారు

రాయవరం: చెల్లూరులో శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి జాతరను ఉత్సవ కమిటీ వైభవంగా నిర్వహించింది. ఏటా మావుళ్లమ్మ అమ్మవారి జాతరను నిర్వహించడం పరిపాటి. అందులో భాగంగా గత నెల 19న అమ్మవారిని గ్రామంలో నిలబెట్టారు. అప్పటి నుంచి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 3న అమ్మవారికి చండీహోమం, కుంభాభిషేకం నిర్వహించగా ఆదివారం అమ్మవారికి చిన్న జాతర జరిపారు. సోమవారం సాయంత్రం అమ్మవారిని పుట్టింటికి తీసుకుని వెళ్లనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. మంగళవారం అమ్మవారికి పెద్ద జాతర నిర్వహిస్తారని, ఈ నెల 11న పొలిమేర కట్టుట, చల్లఘటం తిప్పనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చిన్న జాతర సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

సత్యనారాయణకు రాజుబాబు పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న రాజుబాబు తదితరులు

మండపేట: కాలికి ఫ్యాక్చరై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, జాతీయ బీసీ సంఘం గౌరవ సలహాదారుడు శీలామంతుల సత్యనారాయణను ఆదివారం వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు పరామర్శించారు. పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, అభయాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, పార్టీ నాయకులు ముక్కాదాలయ్య, తాడి రామారావు, దాసరి సత్యనారాయణ, కొవ్వాడ అప్పన్నబాబు, పెంకే గంగాధర్, చందన వెంకటేష్ పాల్గొన్నారు.

అమ్మకానికి టిడ్కో ప్లాట్లు

- రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయాలు
- దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు
- అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మండపేటలోని టిడ్కో ప్లాట్లు

మండపేట: పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం అందజేస్తున్న టిడ్కో ప్లాట్ల అమ్మకాలు చాపకింద నీరులా జరుగుతున్నాయి. ఒక్కో ప్లాటు రూ.మూడు నుంచి రూ.ఐదు లక్షల రేటుకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. వాటికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. రెండు విడతల్లో మండపేట పట్టణానికి మొత్తం 6,128 ప్లాట్లు మంజూరయ్యాయి. తాగునీరు, లెట్రిన్, ఇతర వసతులు కల్పించకుండా ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావుడిగా ప్రారంభోత్సవాలు చేయించింది. అసంపూర్తి పనులతో నివాస యోగ్యంగా లేక లబ్ధిదారులు ఎదురు చూపులు చూడాల్సి వచ్చింది. లబ్ధిదారుల ఇబ్బందుల దృష్ట్యా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ తీసుకుని వసతుల కల్పనకు కృషి చేశారు. ముందుగా పనులు పూర్తయిన మేర గత అక్టోబరులో 2,109 మందికి ప్లాట్లను స్వాధీనం చేశారు. వారిలో 300 చదరపు అడుగుల సింగిల్ బెడ్‌రూం కేటగిరీ లబ్ధిదారులు 1,625 మంది ఉండగా, 365 చదరపు అడుగుల సింగిల్ బెడ్‌రూం లబ్ధిదారులు 61, మంది 430 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు 423 మంది ఉన్నారు. రెండో విడతగా మిగిలిన 4,019 ప్లాట్ల వద్ద మౌలిక వసతుల కల్పన దాదాపు పూర్తి కాగా త్వరితగతిన వాటిని లబ్ధిదారులకు స్వాధీనం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చాపకింద నీరులా..

తొలి విడతగా స్వాధీనం చేసిన ప్లాట్లలో అప్పుడే అమ్మకాలు మొదలైనట్టు తెలుస్తోంది. 300 చదరపు అడుగల ప్లాట్లను ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తుండగా, మిగిలిన కేటగిరీ ప్లాట్లకు బ్యాంకు రుణాలు ఉన్నాయి. రుణభారం లేకపోవడంతో 300 చదరపు అడుగల కేటగిరీ ప్లాట్ల క్రయవిక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌లో ప్లాటును బట్టి రూ.మూడు నుంచి రూ ఐదు లక్షల వరకు రేటుకు అమ్మకాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఆర్థికపరమైన ఇబ్బందులతో కొందరు అమ్ముతుండగా గత ప్రభుత్వంలో అనర్హులకు ప్లాట్లు ఇవ్వడం కొంత కారణమని అంటున్నారు. ఇప్పటికే 250 మంది అనర్హులకు ఇచ్చిన ప్లాట్లను రద్దుచేసి అర్హులైన వారికి వాటిని కేటాయించారు. తొలివిడతగా స్వాధీనం చేసిన వాటిలో 1,260 ప్లాట్లలోకి జనం రాగా వారిలో 20 శాతానికి పైగా అద్దెకు వచ్చిన వారు ఉంటున్నారంటున్నారు. ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్లాట్లు విక్రయిస్తే కఠిన చర్యలు



ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నట్టు తెలిసింది. టిడ్కో ప్లాట్ల అమ్మకాలు కొనుగోళ్లు చేయడం నిబంధనలకు విరుద్ధం. అటువంటి లావాదేవీలు చెల్లవు. అటువంటి ఆర్థిక లావాదేవీలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు ప్లాటును రద్దుచేసి మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుంది.

– టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

విత్తనశుద్ధితోనే నాణ్యమైన దిగుబడి



శీలలో జీవ నియంత్రణ శిలీంధ్రంతో విత్తనశుద్ధి చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- నారు చల్లే ముందు విత్తనశుద్ధి తప్పనిసరి
- ఆర్‌బీకేల్లో అందుబాటులో మందులు

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో రైతులు తొలి దశ నుంచి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవటంతో పాటు నారుమడులలో విత్తనాలు చల్లే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 67 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది సుమారు 56 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమౌతున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. నియోజకవర్గ గ్రామాల్లో ప్రస్తుతం అధికశాతం రైతులు పంట దమ్ములు నిర్వహిస్తూ నారుమడులు చల్లుకునే పనిలో ఉన్నారు. ఈ తరుణంలోనే విత్తన శుద్ధిపై అవగాహన తీసుకువచ్చేందుకు వ్యవసాయాధికారులు గ్రామగ్రామాన ఆర్‌బీకేల ద్వారా అవగాహన సదస్సులను నిర్వహిస్తూ రైతులలో చైతన్యం తీసుకు వస్తున్నారు. డివిజన్‌లో కొందరు రైతులు నారుపోసి నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తుండగా, కొందరు రైతులు వెదజల్లు (నేరుగా వరి విత్తనాలను దమ్ము చేసిన పొలంలో చల్లటం) విధానాలను అవలంబిస్తున్నారు. ఈ రెండు విధానాల్లోనూ తప్పని సరిగా సూడోమోనాస్ ఫ్లోరెసెస్ అను జీవ నియంత్రణ శిలీంధ్రంతోనూ, ఫాస్ఫో బాక్టీరియా అనే భాస్వరపు జీవన ఎరువుతోనూ, అజో స్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువుతోనూ విత్తనశుద్ధి చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

విత్తనశుద్ధి చేసే విధానం, ఉపయోగాలు:

సూడోమోనస్ ఫ్లోరెసెస్ జీవ నియంత్రణ శిలీంధ్రంతో విత్తన శుద్ధి చేసినట్లయితే వరిలో అధికంగా వచ్చే అగ్గితెగులు, మాగుడు తెగులు, పొడ తెగులు రాకుండా 30 నుంచి 40 రోజులు పూర్తిగా రక్షణ కల్పిస్తుందన్నారు. అదే విధంగా ఫాస్ఫో బాక్టీరియా భాస్వరపు జీవన ఎరువుతో విత్తన శుద్ధి చేసస్తే భూమిలో లభ్యం కాని స్థితిలో ఉండిపోయిన భాస్వరాన్ని మొక్కలకు తిరిగి లభ్యమయ్యేలా చేస్తుందన్నారు. అజో స్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువు వలన ఎకరానికి ఎనిమిది నుంచి 16 కిలోలకు సరిపడా నత్రజని పైరుకు అందుతుందన్నారు. ఎకరానికి సరిపడా విత్తనాలకు 400 గ్రాముల జీవన ఎరువులను బాగా పట్టించి నారుమడి లేదా వెదజల్లిన పొలాల్లో చల్లుకోవాలన్నారు. అలా వీలు కానివారు 20 కిలోల పశువుల ఎరువులోనైనా కలిపి ఎకరం పొలంలో నేలపై చల్లుకోవాలన్నారు.

మంచి ఫలితాలు



గత ఏడాది వ్యవసాయాధికారులు సూచనల మేరకే విత్తన శుద్ధి చేసి విత్తనాలు నారుమడిలో చల్లాను. మంచి ఫలితాలు కనిపించాయి. చిన్నపాటి ఈదురు గాలులు, వర్షాలకు పంట పడిపోకుండా నిలబడింది. చాలా వరకూ అగ్గితెగులు, మాగుడు తెగులు, పొడ తెగులును తట్టుకుంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు బందనపూడి

శ్రమకు మించి ఫలితం దక్కుతుంది



విత్తన శుద్ధి వలన రైతుకు శ్రమకు మించిన ఫలితం దక్కుతుంది. పైరు దృఢంగా పెరిగి ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది. సూడోమోనాస్ ఫ్లోరెసెస్, ఫాస్ఫో బాక్టీరియా, అజో స్పైరిల్లమ్ ప్రతి రైతు భరోసా కేంద్రాల్లోనూ అందుబాటులో ఉన్నాయి.

– వి.అశోక్, ఏవో, కాజులూరు

రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన



కేశవరంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలో జరుగుతున్న ఆంజనేయస్వామి గుడి రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, పార్టీ నాయకులు పరిశీలించారు. సుమారు రూ.16 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భూమి పూజ చేశారు. రోడ్డు పనుల పరిశీలన అనంతరం వెంకన్నబాబు మాట్లాడుతూ దీర్ఘకాలంగా గ్రామాన్ని పట్టి పీడిస్తున్న రోడ్డు సమస్య ఎమ్మెల్సీ తోట చొరవతో పరిష్కారమైందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ పాల్గొన్నారు.

కాటి కాపరిని నియమించాలని వినతి



సర్పంచ్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శ్మశానవాటికలో కాటి కాపరిని నియమించాలని కోరుతూ ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణకు గ్రామస్తులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కైలాస భూమి అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని దాని నిర్వహణకు కాపలాదారుని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు సాక్షి పద్మనాభం, పెద్దలు మాగాపు అమ్మిరాజు, నామా వెంకన్నబాబు, నవీన్, అయ్యప్ప, మైలవరపు చంటి, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భర్త, అత్త, ఆడపడుచు కొట్టారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: గత 12 ఏళ్లుగా భర్తతో విడిపోయి వేరుగా ఉంటున్న తనపై భర్త, అత్త, ఆడపడుచు గొడవ పెట్టుకుని కొట్టినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉట్రుమిల్లికి చెందిన మేకపాటి విజయదుర్గకు మేకపాటి శ్రీనుతో 2009లో ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. వారికి కూతురు పుట్టింది. అయితే పెళ్లైన రెండు సంవత్సరాలకే మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఈ నెల 6న భర్త శ్రీను, అత్త రాఘవ, ఆడపడుచు లావణ్యలు విజయదుర్గ ఉంటున్న ఇంటికి వచ్చి ఆమె వద్ద ఉన్న ఫోను ఇవ్వమని అడిగారు. ఆమె నిరాకరించడంతో ముగ్గురు కలసి ఆమెను కొట్టారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అకారణంగా కొట్టారంటూ ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటకు చెందిన లంక శ్రీను, అతని కుమారుడు సురేంద్రలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది మే నెల 23న ఉదయం ద్రాక్షారామలో తోటవారి లే అవుట్‌లో ఉండగా వేమగిరి చిన్న, వేమగిరి భరత్, వేమగిరి సత్యంలు కర్రలతో వచ్చి దాడి చేశారని, విషయాన్ని పెద్దలలో పెట్టగా అక్కడ న్యాయం జరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో ఈ నెల 8న గుర్తు తెలియని మహిళను ముప్పనపల్లి గణేష్ కారు అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి గుద్దినట్లు గ్రామ వీఆర్‌ఓ వాసంశెట్టి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆ మహిళకు తలకు గాయం కావడంతో ముందుగా కుందూరు పీహెచ్‌సీకి అనంతరం మెరుగైన చికిత్స కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: యానం ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. యానాంకు చెందిన మాత రాజారావు తన బైక్‌పై ద్రాక్షారామ వెళ్లి తిరిగి వస్తున్నారు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్ బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో రాజారావు గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాలపాలైన అతడిని యానం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రధాని మోదీ పాలనపై కరపత్రాల పంపిణీ



అయితపూడిలో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు

కాజులూరు: ప్రధాని నరేంద్రమోదీ పాలన చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం అయితపూడి, తనుమళ్లల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల కిసాన్ మోర్చ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఇంటింట పర్యటించి బీజేపీ పాలనలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

గోగులాంబ అమ్మవారికి తీపి కావిడి మహోత్సవం



గోగులమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన తీపి కావిడి, పండ్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన గోగులాంబ అమ్మవారికి ఆదివారం ఆషాఢమాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీపి కావిడి మహోత్సవం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయాన్నే గ్రామస్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి స్వీట్లు, పండ్లు కావిడిగా తీసుకుని వచ్చి సమర్పించారు. మహిళా భక్తులు అమ్మవారి సన్నిధిలో లలితా పారాయణ చేశారు.

మాచవరంలో భారీ అన్నదానం

రాయవరం: మండలంలోని మాచవరం అరుంధతీయపేటలో భారీ అన్నదానం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఎంపీటీసీ సభ్యుడు పలివెల శోభన, వైఎస్సార్ సీపీ నేత పలివెల సతీష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు బాంధవుడిగా రైతులకు అందించిన సేవలను ప్రశంసించారు. ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన శ్రీమోక్ష స్వచ్ఛంద సంస్థ ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలనీలోని వంద మందికి పైగా పేదలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు చోడే శ్రీకృష్ణ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎగ్గాడి లోవారాజు, లక్ష్మణ్, సందీప్, ఎగ్గాడి సతీష్, నురుకుర్తి నాని పాల్గొన్నారు.

భద్రాద్రి రామునికి పాపారాయుడి పూజలు

మండపేట: రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి కోలుకున్న వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు, వికాస తరంగిణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కర్రి పాపారాయుడు ఆదివారం భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. పాపారాయుడి వెంట మండపేట మండల ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుడిపూడి రాంబాబు, కొప్పిరెడ్డి ప్రసాద్, పలివెల సుధాకర్ ఉన్నారు.

సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలి

యానాం: యానాం రీజియన్‌లో ఈడబ్ల్యూఎస్ (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్) సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యానాం రీజియన్‌లో ఎంబీబీఎస్ సీట్ల కోసం ఆర్థికంగా బలమైనవారు సైతం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పొందుతున్నారని ఆరోపించారు. యానాం రీజియన్‌లో చదువుకున్నవారికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాల్సి ఉన్నా అది జరగడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రముఖ కార్పొరేట్ కాలేజీల్లో లక్షలాది రూపాయిలు ఖర్చు చేసి చదువుతున్న వారు ఆర్థికంగా వెనకబడిన కోటాకు ఎలా అర్హులవుతారని ప్రశ్నించారు.

కేవలం రేషన్‌కార్డులో పేరు చూపించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాంలో మాత్రమే ఇంటర్ చదివి, తల్లిదండ్రులు ఇక్కడే నివాసం ఉంటూ రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ మంజూరుచేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి

- పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు



ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

యానాం: యానాం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర ప్రధాన అంశాలపై పలువురు కార్యకర్తలు, నాయకులతో యర్రాగార్డెన్స్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రీక్రియేషన్ పేరిట యువతను పక్కదోవ పట్టిస్తున్న పేకాట క్లబ్బులను శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. మెట్టకూరు పరిధిలో గోపాల్‌నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో డంపింగ్ యార్డు ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. గత కొన్ని నెలలుగా ఉపాధి కోల్పోతున్న కురసాంపేట ఇసుక ర్యాంపు కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. యానాం తీర గ్రామాలను, పట్టణాన్ని వరద నీటి నుంచి కాపాడేలా వరద రక్షణ గోడను నిర్మించాలని చెప్పారు. పీడబ్ల్యూడీ శాఖలో ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న 121 మంది సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. యానాం మాస్టర్‌ప్లాన్ తయారీ కోసం పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో 110 పనుల ఆమోదానికి ఓఎన్‌జీసీ సంస్థతో చర్చించాలన్నారు. వైఎస్సాఆర్ లింకింగ్ చానల్ రెండో దశ పనులు చేపట్టాలని, వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లాడి శామ్యూల్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గిడ్ల చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు, బోళ్ల జోజి, కార్తీక్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ



పోలీస్ ఉద్యోగార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న, విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు

అమలాపురం రూరల్: ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్న 80 మంది పోలీస్ ఉద్యోగార్థులకు శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి, విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబుల చేతుల మీదుగా ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సభలో డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి కష్టపడి పరీక్షలో విజయం సాధించాలని, అందుకు అవసరమైన తోడ్పాటును తాము అందిస్తామని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఎలా సన్నద్ధమైతే విజయం సాధించొచ్చో మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది పెయ్యల శ్రీనివాసరావు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మాజీ సర్పంచ్ నక్కా సంపత్, నక్కా చంద్రశేఖర్, పెనుమాల చిట్టిబాబు, బళ్ల సత్యనారాయణ, గూటం సాయి, విజయ బాబు తదితరులు పాల్గొన్నారు.



దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా రాయవరం మండలం పసలపూడిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు తదితరులు